క్లుప్తంగా

పాలిటెక్నిక్ కాలేజీలో యాడ్ ఆన్ కోర్సులు ప్రారంభం

కందుకూరు: స్కిల్ డెవలప్‌మెంట్‌లో భాగంగా స్టేట్ బోర్డు ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ సహకారంతో పట్టణంలోని పాలిటెక్నిక్ కాలేజీలో యాడ్ ఆన్ స్కిల్ కోర్సులు ప్రవేశపెడుతున్నట్లు కాలేజీ ప్రిన్సిపాల్ కె.మస్తానయ్య తెలిపారు. ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ బ్రాంచ్‌లో ఎలక్ట్రికల్ క్యాడ్, పీఎల్‌సీ కోర్సులను, సివిల్ ఇంజినీరింగ్ బ్రాంచ్ వారికి రివిట్ ఆర్కిటెక్చర్ కోర్సులను సెప్టెంబర్ 2 నుంచి ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ కోర్సులను 45 రోజుల్లో పూర్తి చేస్తామన్నారు. ఐటీఐ, ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు, పాలిటెక్నిక్ ద్వితీయ, తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు. కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు ఉద్యోగాలకు ఉపకరించే సర్టిఫికెట్లను స్టేట్ బోర్డు ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ద్వారా ఇస్తామన్నారు.

డ్రగ్స్‌కు అలవాటుపడితే జీవితం నాశనం


మాట్లాడుతున్న సీఐ భీమానాయక్

పామూరు: యువత డ్రగ్స్ వినియోగానికి అలవాటుపడితే జీవితం నాశనమవుతుందని సీఐ ఎం భీమానాయక్ అన్నారు. స్థానిక అక్షర విద్యాసంస్థల్లో గురువారం డ్రగ్స్ వాడటం వల్ల నష్టాలపై సీఐ విద్యార్థులకు అవగాహన కల్పించారు. అదేవిధంగా హెల్మెట్ వాడటం వల్ల లాభాలు, వాడకపోతే నష్టాలను వివరించారు. విద్యార్థులు వాహనాలు నడిపేవారు విధిగా లైసెన్స్ కలిగి ఉండాలని, హెల్మెట్ ధరించి ఉండాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. కళాశాల సీపీ కదిరి బాబూరంగారావు, జాజం శ్రీనివాసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎకో టూరిజం పార్కు పరిశీలన


మాట్లాడుతున్న సీఐ భీమానాయక్

హనుమంతునిపాడు: మండల పరిధిలోని హాజీపురం ఫారెస్టు కంభం కనిగిరి రహదారి పక్కన హాజీపురం ఎత్తు రోడ్డు వద్ద రూ 2.50 కోట్లతో ఏర్పాటు చేస్తున్న ఎకో టూరిజం పార్కును ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి గురువారం పరిశీలించారు. ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ కె.రామిరెడ్డిని పార్కు నిర్వహణ గురించి అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్కుకు వచ్చే వారికి అన్ని వసతులు ఉండేలా నిర్మించాలన్నారు. ఈ పార్కు ఈ ప్రాంత ప్రజలకు ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. మండల నాయకులు గాయం తిరుపతరెడ్డి, ఫారెస్టు రేంజర్ కె.రామిరెడ్డి, డిప్యూటీ రేంజర్ తులసీరావు, బీట్ అధికారులు ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు అవసరం


మర్రిపూడిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ వీరబాబు

మర్రిపూడి: దోమలు కుట్టకుండా, పుట్టకుండా చూసుకోవాలని మర్రిపూడి పీహెచ్ వైద్యాధికారి వీరబాబు సూచించారు. గురువారం మండలంలోని దుగ్గిరెడ్డిపాలెం, మర్రిపూడి గ్రామాల్లో జ్వరాలపై ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ ఇంటి పరిశరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కొబ్బరి బొండాలు, నీటితొట్లు, ప్లాస్టిక్ డబ్బాల్లో నీరు రోజులు తరబడి నిల్వలేకుండా చూసుకోవాలన్నారు. రాత్రి కాగానే ఇంటి కిటికీలు, తలుపులు మూసివేసుకోవాలని, దోమతెరలు వాడాలన్నారు. సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం ఇళ్లలో నీటి నిల్వలు తొలగించి బ్లీచింగ్ చల్లించారు. ఆయన వెంట సీహెచ్‌ఓ నాగేశ్వరరావు, సూపర్‌వైజర్ రమాదేవి, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

పాఠశాలల బలోపేతానికి కృషిచేయాలి

పొన్నలూరు: గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంఈఓ రవిచంద్రబాబు పేర్కొన్నారు. స్థానిక విద్యా వనరుల కేంద్రంలో గురువారం హెచ్ఎంలు, సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీలు, స్కూల్ కమిటీ చైర్మన్లకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఎంఈఓ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అలాగే ఐఎంఎంఎస్ యాప్‌లో మరుగుదొడ్ల తనిఖీ ఫొటోలు అప్‌లోడ్ చేయడంపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 హరిబాబు, సీఆర్పీలు పాల్గొన్నారు.



వాచ్‌మెన్లను నియమించాలి

ప్రభుత్వ ఆస్పత్రిలో రాత్రి పూట వాచ్‌మెన్‌ను నియమించాలి. రోజూ రాత్రి పూట పోలీస్ పికెటింగ్ ఉండేలా చర్యలు తీసుకోవాలి. మహిళా వైద్యులతోపాటు వైద్య సిబ్బంది భద్రతకు ప్రభుత్వం భరోసా కల్పించాలి. భయపడుతూ వైద్యం చేయడం వల్ల రోగుల ప్రాణాలకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంటుంది. కోల్‌కతా తరహా ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ట చట్టాలు రూపొందించాల్సిన అవసరం ఉంది.

– డాక్టర్ కె.ధీరేందర్ కుమార్, సింగరాయకొండ పీహెచ్‌సీ



పూర్తిస్థాయిలో రక్షణ చర్యలు చేపట్టాలి

వైద్యులకు నిర్ణీత పనివేళలు ఉండవు. అత్యవసరమైతే ఏ సమయంలోనైనా వైద్యశాలకు వచ్చి వైద్య సేవలందించాలి. కోల్‌కతా ఘటనతో రాత్రిళ్లు అత్యవసర కేసులకు హాజరుకావాలంటేనే మహిళా వైద్యులు భయపడే పరిస్థితులు నెలకొన్నాయి. మహిళా వైద్యులకు, సిబ్బందికి పూర్తి స్థాయిలో రక్షణ కల్పించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలి. గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే మహిళా డాక్టర్ల రక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి.

– డాక్టర్ దాసరి హరిబాబు, పీహెచ్‌సీ, బొట్లగూడూరు



ఘనంగా మాతృభాషా దినోత్సవం


సీఎస్‌పురం కేజీబీవీలో కృష్ణదేవరాయలు, అష్టదిగ్గజాల వేషధారణ..


పీసీపల్లిలో నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు


అలకూరపాడులో నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

సీఎస్‌పురం(పామూరు): మండలంలో మాతృభాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సీఎస్‌పురం కేజీబీవీలో ఎస్‌ఓ షేక్.రేష్మ, కోవిలంపాడు ఎంపీయూపీఎస్‌లో బి.శివప్రసాదాచారి ఆధ్వర్యంలో మాతృభాష, క్రీడా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మాతృభాష ఔన్నత్యాన్ని విద్యార్థులకు వివరించారు. విద్యార్థులకు క్రీడల వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు. గిడుగు రామ్మూర్తి, ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేజీబివిలో శ్రీకృష్ణదేవరాయల కొలువులో అష్టదిగ్గజ కవుల వేషధారణలు అలరించగా కోవిలంపాడులో దేశనాయకులు, ప్రముఖుల చిత్రపటాలను విద్యార్థులు ప్రదర్శించారు.

పామూరు: విద్యార్థులు విద్యతో పాటు క్రీడలకూ ప్రాధాన్యం ఇవ్వాలని కేజీబీవీ ఎస్‌ఓ కటకం సజన, నర్రమారెళ్ల ఎంపీయూపీఎస్ హెచ్‌ఎం మహబూబ్‌బాషా, అన్నారు. స్థానిక కేజీబీవీతో పాటు మండలంలోని పలు పాఠశాలల్లో గురువారం గిడుగు రామ్మూర్తి జయంతి (మాతృభాషా దినోత్సవం), హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ జయంతి (జాతీయ క్రీడా దినోత్సవం) సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, క్రీడలు నిర్వహించి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మాతృభాషా దినోత్సవం గురించి మాట్లాడుతూ పాశ్చాత్య మోజులో పడి నేటి యువత మాతృభాషకు ప్రాధాన్యం ఇవ్వడం లేదని, మాతృభాషను మరిస్తే వారు కన్నతల్లిని మరిచినట్లేనన్నారు. విద్యతో పాటు క్రీడలపై దృష్టి సారించాలన్నారు. క్రీడలతో మానసిక ఉల్లాసం, శారీరక దృఢత్వంతో పాటు ఏకాగ్రత, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయన్నారు. ముందుగా గిడుగు రామ్మూర్తి, ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. కేజీబీవీలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉప్పుతో వేసిన భారతదేశం, భరతమాత చిత్రం అలరించింది. తోట రమేష్, ఎస్.నీరజ, బి.కోటేశ్వరరావు, కె.సుజాత, డి.నాగేశ్వరరావు, ఎస్‌వీ సాద్, ఇ.వెంకటేశ్వర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.


సీఎస్‌పురం కేజీబీవీలో గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి నివాళులు


పామూరు కేజీబీవీలో గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు


సింగరాయకొండలో గిడుగు, ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు నివాళి..

పీసీపల్లి : తెలుగు వ్యవహార భాషకు ఆద్యుడు గిడుగు వెంకట రామ్మూర్తి అని శ్రీశ్రీ కళావేదిక జాతీయ అధ్యక్షురాలు జి. ఈశ్వరీభూషణం అన్నారు. గిడుగు రామ్మూర్తి జయంతి సందర్భంగా పీసీపల్లి జెడ్పీ హైస్కూల్‌లో తెలుగు భాష దినోత్సవం, జాతీయ క్రీడల దినోత్సవం సందర్భంగా గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు నరసింహం, ఆదినారాయణ, జరీనా, రుక్మిణీ, జ్యోత్స్న, సుజాత, ఉషారాణి, కుమారి, నాగార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టంగుటూరు: మండలంలోని ఆలకూరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో తెలుగు భాషా, క్రీడా దినోత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిడుగు రామమూర్తి, మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో గిడుగు చిత్రపటానికి లైబ్రేరియన్ గుమ్మడి వర్ధనరాజు ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు పెన్నులు, స్వీట్లు పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయుడు వాకా వెంకటేశ్వరరెడ్డి, తెలుగు ఉపాధ్యాయులు ముప్పరాజు సురేష్, పీఈటీ పల్లిపాటి వెంకట్రావు, డి.శ్రీధర్, భూషణరెడ్డి, జ్యోతి, సుభాషిణి, విజయలక్ష్మి, చెన్నయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తెలుగు భాష, జాతీయ క్రీడా దినోత్సవం

సింగరాయకొండ: స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిడుగు రామ్మూర్తి, ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు తెలుగు ఉపాధ్యాయురాలు ఎ.గోవిందమ్మ, పీఈటీ ఎల్.లావణ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన సీఐ

పీసీపల్లి: స్థానిక పోలీస్‌స్టేషన్‌ను సీఐ ఎస్‌కే ఖాజావలి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ పనిచేస్తున్న ఎస్సై రమేష్‌బాబు మర్రిపూడి స్టేషన్‌కు వెళతారని, త్వరలో కొత్త ఎస్సై బాధ్యతలు స్వీకరిస్తారన్నారు. గస్తీలు ముమ్మరం చేయాలనరి సూచించారు. రామచంద్రారెడ్డి సిబ్బంది ఉన్నారు.

మాలకొండయ్యను పరామర్శించిన దద్దాల

పీసీపల్లి: మండలంలోని వెంగళాయిపల్లి ఎస్సీ కాలనీకి చెందిన గుడిపూడి చిన్న మాలకొండయ్య అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ ఆయన స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. అయన వెంట నాయకులు గోపవరపు బొర్రారెడ్డి, మాజీ సర్పంచ్ శీలం సుదర్శనం, యూత్ అధ్యక్షుడు మేకల మాల్యాద్రి, యేరువ నరసింహం, కరణం మహాలక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

కనిగిరి రూరల్: మండలంలో జరిగిన పలు శుభకార్యాల్లో వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ గురువారం పాల్గొన్నారు. బడుగులేరులో ఎంపీటీసీ పాపనబోయిన నాగేశ్వరరావు కోటమ్మ నూతన గృహ ప్రవేశ వేడుకల్లో పాల్గొన్నారు. బత్తుల మాలీ, గోబ్బిళ్ల శ్రీను, కటికల వెంకట రత్నం, తదితరులు పాల్గొన్నారు.


చిన్న మాలకొండయ్యను పరామర్శిస్తున్న దద్దాల నారాయణ యాదవ్

చిరస్మరణీయుడు అబ్దుల్ బషీర్

కనిగిరి రూరల్: దివంగత ఎన్జీఓ సంఘ నేత అబ్దుల్ బషీర్ చిరస్మరణీయుడని పలువురు వక్తలు అన్నారు. ఎన్జీఓ సంఘ రాష్ట్రనేత, జిల్లా మాజీ అధ్యక్షుడు దివంగత ఎస్‌కే అబ్దుల్ బషీర్ నాల్గవ వర్ధంతిని ఎన్జీఓ సంఘాలు, ఉద్యోగులు, కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ ఎన్జీవో నేత బషీర్ ఉద్యోగ వర్గాల అభ్యున్నతికి ఎనలేని కృషి చేశారని కొనియడారు. ఎన్జీవో సంఘంలో రాష్ట్ర స్థాయి నేతగా ఎదిగి కనిగిరికే గుర్తింపు తెచ్చారని కీర్తించారు. ఎన్జీఓ సంఘ కనిగిరి తాలుకా నాయకుడు పిల్లి వెంకట రమణారెడ్డి, వికలాంగుల హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ధూళిపాళ్ల మల్లికార్జునరావులు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల పక్షాన, సమస్యల పరిష్కారంకు బషీర్ అనేక పోరాటాలు చేసి విజయం సాధించారని కొనియాడారు. ఈ సందర్భంగా స్థానిక మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో మొక్కలు నాటడం. గార్లపేట రోడ్డులోని వృద్ధాశ్రమంలో కొత్తూరులోని ఎస్‌కేఆర్ మానసిక వికలాంగుల కేంద్రంలో అన్నదానం చేశారు. కుటుంబసభ్యులు, వివిధ సంఘాల నాయకులు సింగంపల్లి రాంప్రసాద్, హజరత్ అలీ, ఖాదర్, కిరణ్, తమ్మినేని పెద్దిరెడ్డి, చిలకల శివరామిరెడ్డి, గయాజ్, మీగడ వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


బషీర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న చైర్మన్ గఫార్, ఎన్జీవో నేతలు

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ట

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని మిట్టపాలెంలో కోదండరామస్వామి ఆలయంవద్ద నూతన ధ్వజస్తంభ ప్రతిష్టా మహోత్సవం రుత్వికులు మంకాల సత్యనారాయణశర్మ వేదమంత్రాల నడుమ గురువారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు ధ్వజస్తంభ ఏర్పాటు ప్రాంతంలో గర్ధిరికి విశిష్ట పూజలు చేసి ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. నారాయణస్వామి అలయ మాజీ చైర్మన్ పాములపాటి మాధవప్రసాద్, అలయ కమిటీ సీహెచ్ తిరుపతయ్య, కమణమ్మ, పామూరులపాటి నరేంద్ర, రాజేంద్రప్రసాద్, లక్ష్మీనరసయ్య తదితరులు పాల్గొన్నారు.

చిరు ధాన్యాలు సాగు చేయండి


రైతులకు సూచనలిస్తున్న శాస్త్రవేత్తలు

సింగరాయకొండ: చిరు ధాన్యాలైన రాగులు, సామలు, సజ్జలు సాగు చేసి అధిక లాభాలు సాధించాలని కందుకూరు కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జి.ప్రసాద్‌బాబు సూచించారు. మండలంలోని పాకల, కలికవాయ గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా రైతులకు చిరుధాన్యాల విత్తనాలు అందజేశారు. ఈ సందర్భంగా వంగ తోటను పరిశీలించి కొమ్మ, కాయ తొలిచే పురుగు ఉందని, వాటి నివారణకు ఎకరాకు 10 లింగాకర్షక బుట్టలు పెట్టుకుని పురుగు ఆశించిన కొమ్మలను తుంచివేసి వేపనూనె 5 మిల్లీలీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. మిరపలో ఎండు తెగులు, నులిపురుగుల నివారణకు పలు సూచనలు చేశారు. శాస్త్రవేత్తలు డాక్టర్ వెంకటేష్, డాక్టర్ జ్యోతి, డాక్టర్ నిహారిక, డాక్టర్ శ్రీరంగ, మయాంక్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వెంకటరమణ, రామసుబ్బమ్మ, రైతులు పాల్గొన్నారు.

మర్లపాడులో పడకేసిన పారిశుధ్యం


మర్లపాడులో రోడ్డు పక్కన పడేసిన చెత్త


జెడ్పీ హైస్కూల్ పక్కన చెత్త పడేసిన హోటల్ యజమానులు

టంగుటూరు: మండలంలోని మర్లపాడు గ్రామంలో పారిశుధ్యం దారుణంగా తయారైంది. డంపింగ్ యార్డ్ లేక రోడ్డు పక్కనే చెత్త వేస్తుండటం వల్ల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. గ్రామంలో పారిశుధ్య సిబ్బంది సేకరించిన చెత్తతోపాటు హోటళ్లలోని వ్యర్థాలను స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ సమీపంలోనే రోడ్డు పక్కన పడేస్తున్నారు. దీంతో స్థానిక ప్రజలు దుర్వాసనతో ఇబ్బంది పడుతూ రోగాలు ప్రబలుతాయేమోనని ఆందోళన చెందుతున్నారు. పైగా అక్కడి చెత్తను తగలబెడుతుండటంతో పొగ ఇళ్లను కమ్మేస్తోంది. ఈదురుగాలులు వీచినప్పుడు చెత్తాచెదారం ఇళ్లలోకి వస్తోంది. స్కూల్ సమీపంలోనే చెత్త వేస్తుండటం వల్ల విద్యార్థులు, ఉపాధ్యాయులు కూడా ఇబ్బందులకు గురవుతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి చెత్త సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వినాయక మండపాలకు నిబంధనలు పాటించాలి

కనిగిరి రూరల్: వినాయక చవితి పండుగ సందర్భంగా గణేషుని విగ్రహాల ఏర్పాటుకు, పందిళ్లు, మండపాలు ఏర్పాటు చేసుకునే వారు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని సీఐ ఎస్‌కే ఖాజావలి అన్నారు. స్థానిక కార్యాలయంలో గురువారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ ఎస్‌కే ఖాజావలి మాట్లాడుతూ వినాయక చవితి పండుగను అందరూ సంతోషంగా జరుపుకోవాలని కోరారు. అనంతరం గణేష్ మండపాల వద్ద ఆర్గనైజర్స్ తీసుకోవలసిన జాగ్రత్తలు గూర్చి వివరించారు. గణేష్ మండపాలకు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలలన్నారు. ప్రభుత్వ స్థలంలో మండపం ఏర్పాటు చేస్తుంటే మున్సిపాలిటీ, పంచాయతీ నుంచి పర్మిషన్ తీసుకోవాలన్నారు. అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రాత్రిళ్లు విగ్రహాల వద్ద తప్పనిసరిగా కాపాలా ఉండేలా చూసుకోవాలని చెప్పారు. నిమజ్జనం సందర్భంగా కమిటీ ప్రతినిధులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అనుమతి లేకుండా విగ్రహాలు ఏర్పాటు చేస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. సమావేశంలో ఎస్సై టి.త్యాగరాజు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీఐ ఎస్‌కే ఖాజావలి

శాస్త్ర సాంకేతిక రంగాలపై మక్కువ పెంచాలి

కనిగిరి రూరల్: విజ్ఞాన శాస్త్ర, సాంకేతిక రంగాలపై, విద్యార్థులకు మక్కువ పెరిగేలా నూతన విద్యాబోధన చేయాలని డిప్యూటీ డీఈఓ చంద్రమౌళేశ్వరరావు అన్నారు. స్థానిక కార్యాలయంలో హెచ్‌ఎం జి.సంజీవి అధ్యక్షతన ఇన్‌స్పైర్ మనక్ నామినేషన్ల కార్యక్రమం ప్రభుత్వ, ఎయిడెడ్, స్థానిక సంస్థల, ప్రైవేట్, ఆదర్శ, కస్తూరిబా పాఠశాలల సైన్స్ ఉపాధ్యాయులతో సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఈఓ మాట్లాడుతూ ప్రభుత్వం సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం కార్యక్రమాల్లో భాగంగా ఇన్‌స్పైర్ అవార్డులను విద్యార్థులకు అందజేయనున్నట్లు తెలిపారు. విద్యార్థుల్లో చదువుతో పాటు, వినూత్న ఆలోచనలు పెంపొందించడానికి చేపట్టిన ఇన్‌స్పైర్ మనక్ నామినేషన్లు జిల్లా నుంచి ఎక్కువ మంది చేసేలా సైన్స్ టీచర్లు ప్రోత్సహించాలని కోరారు. ఎంఈఓ యువీ నారాయణరెడ్డి, ఆర్ శ్రీనివాసులు, ఎంఈఓల సంఘ జిల్లా అధ్యక్షుడు దేవిరెడ్డి రామిరెడ్డి, సైన్స్ ఉపాధ్యాయులు బి. తిరుపతయ్య, కె.రాము, పీవీ రమణయ్య, ఎస్ నాగేశ్వరరావు, రిసోర్స్‌పర్సన్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డిప్యూటీ డీఈఓ చంద్రమౌళేశ్వరరావు

అక్రమ బ్యారన్లు నిర్మిస్తే చర్యలు


వేలాన్ని పరిశీలిస్తున్న ఆర్ఎం లక్ష్మణరావు


టంగుటూరులో వేలం నిర్వహిస్తున్న శ్రీనివాసరావు

- టుబాకో బోర్డు ఆర్ఎం లక్ష్మణరావు హెచ్చరిక

కొండపి(సింగరాయకొండ): టుబాకో బోర్డు అనుమతి లేకుండా బ్యారన్లు నిర్మిస్తే చర్యలు తప్పవని బోర్డు రీజినల్ మేనేజర్ లక్ష్మణరావు హెచ్చరించారు. గురువారం ఆయన కొండపి వేలం కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. బోర్డ్ అనుమతించిన మేరకు పొగాకు సాగు చేయాలని, పొగాకు అక్రమ కొనుగోలు చట్టరీత్యా నేరమన్నారు. అన్ని గ్రేడ్లకు మంచి ధర ఇవ్వాలని వ్యాపారులకు సూచించారు. కార్యక్రమంలో బోర్డు మెంబర్ బొడ్డపాటి బ్రహ్మయ్య, వేలం నిర్వహణాధికారి జి.సునీల్ కుమార్, రైతులు పాల్గొన్నారు.

సరాసరి ధర రూ.279.57

కొండపిలో గురువారం నిర్వహించిన వేలంలో పొగాకు సరాసరి ధర రూ.279.57 పలికింది. ధర్మవరం, కోయవారిపాలెం, వెంకటకృష్ణాపురం, ముక్కోటిపాలెం, తాటాకులపాలెం గ్రామాల రైతులు 1261 బేళ్ల వేలానికి ఉంచగా 1006 బేళ్లు కొనుగోలయ్యాయి. వ్యాపారులు వివిధ కారణాలతో 255 బేళ్లను తిరస్కరించారు. పొగాకు గరిష్ట ధర రూ.358, కనిష్ట ధర రూ.195 పలికింది. వేలంలో 16 మంది వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారని నిర్వహణాధికారి తెలిపారు.

990 పొగాకు బేళ్లు కొనుగోలు

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రం పరిధిలో గురువారం నిర్వహించిన వేలంలో 990 పొగాకు బేళ్లు కొనుగోలయ్యాయి. ఎం.నిడమానూరు క్లస్టర్ గ్రామాల రైతులు 1136 బేళ్లను వేలనికి ఉంచగా వాటిలో 990 కొనుగోలయ్యాయి. వ్యాపారులు వివిధ కారణాలతో 146 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.358, కనిష్ట ధర రూ.195, సరాసరి ధర రూ.295.66 పలికింది. వేలంలో మొత్తం 45 మంది వ్యాపారులు పాల్గొన్నారని నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

కార్పొరేట్ ఉద్యోగాల కల్పనా కేంద్రం ప్రకాశం

కందుకూరు: ప్రకాశం ఇంజినీరింగ్ కాలేజీ ఉద్యోగాల కల్పనలో మరోసారి బ్రాండ్ అంబాసిడర్‌గా నిలిచిందని కాలేజీ టెక్నికల్ డైరెక్టర్ డాక్టర్ కంచర్ల విజయశ్రీనివాస్ అన్నారు. బుధ, గురువారాల్లో బెంగుళూరుకు చెందిన ఆల్‌సెక్, పీఎన్‌కె కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలు నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో 77 మంది ఉద్యోగాలు దక్కాయని తెలిపారు. ఆల్‌సెక్‌కు ఎంపికైన 67 మందికి వార్షిక వేతనం రూ 2.2లక్షల, పీఎన్‌కేకు ఎంపికైన వారికి రూ.1.8 లక్షల వేతనం ఉంటుందని చెప్పారు.

విద్యార్థుల ఆరోగ్య స్థితిపై దృష్టి సారించాలి

కనిగిరి రూరల్: పాఠశాలల్లోని ప్రతి విద్యార్థి ఆరోగ్య పరిస్థితులపై ఉపాధ్యాయులు, సిబ్బంది ప్రత్యేక దృష్టి పెట్టాలని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. స్థానిక నాల్గోవ వార్డులోని ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు నిర్వహించిన ఆరోగ్య పరీక్షలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ ఆరోగ్య సిబ్బంది ఆరోగ్య పరీక్షల్లో గమనించిన ఆరోగ్య వివరాలను ఎప్పటికప్పుడు ఉపాధ్యాయులకు తెలియచేయాలని, ఎత్తు, బరువు తదితర విషయాల నివేదికలను కచ్చితంగా చెప్పాలన్నారు. విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు నాణ్యమైన పోషకాహారం తీసుకునే విధంగా సూచనలు చేయాలన్నారు. హెచ్‌ఎం సనావుల్లా, హెల్త్ కార్యదర్శి గౌసబీ, ఆశా కార్యకర్త ద్వారక కుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ఆరోగ్య పరీక్షలను పరిశీలిస్తున్న చైర్మన్ అబ్దుల్ గఫార్